దారుణ దారులు.. శిథిల డ్రైనేజీలు

● 45వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో దుస్థితి ఇది ● ఏళ్లుగా కనీస సౌకర్యాలకు నోచుకోని నివాసులు ● కన్నెత్తి చూడని పాలకులు, అధికారులు


వరాహగిరి కాలనీ-1లో శిథిలమైన కాలువ


వరాహగిరి కాలనీలో అధ్వానంగా రోడ్లు



తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులోని కొండవాలు ప్రాంతాల్లో **కనీస సౌకర్యాలు కరువ**య్యాయి. ముఖ్యంగా భీమిలి నియోజకవర్గ పరిధిలో ఉన్న సత్యసాయినగర్, వరాహగిరి కాలనీ-1, 2, సింహగిరి కాలనీ, సింగాలమ్మపురం కాలనీలు 45వ వార్డులోకి వస్తాయి. ఈ కారణంగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ కాలనీలను పట్టించుకోవడం మానేశారు. వరాహగిరి **కాలనీ-1, 2 కొండవాలు ప్రాంతాల్లో** సరైన రోడ్లు, కాలువలు లేవు. దాదాపు దశాబ్ద కాలం కిందట నిర్మించిన రహదారులు, మెట్ల మార్గాలు కావడం **తో ఇవన్నీ దారుణంగా త**యారై శిథిలమయ్యాయి. **ఈ** ప్రాంతాల్లో డ్రైనేజీ **వ్య**వస్థ కూడా అస్తవ్యస్తం**గా** మారింది. కాలువలు **శి**థిలమై దోమలకు ఆవా**సం**గా మారడంతో కొండ**వా**లు నివాసులు తరచూ **అ**నారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. చీకటి వేళ పిల్లలు, వృద్ధులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. రోడ్డు పక్కనే ఉన్న శిథిల డ్రైనేజీల్లో పడాల్సిందే.

కూటమి పాలనలో అభివృద్ధి శూన్యం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సత్యసాయినగర్‌లో రోడ్లు, డ్రైనేజీలు, వాటిపై కప్పులు వేసి పలు అభివృద్ధి పనులు చేపట్టి, పూర్తిచేశారు. ఆ తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ప్రాంతాల్లో 14 నెలల పాలనలో ఒక్కటంటే ఒక్కటి కూడా అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదు. దేనికీ శంకుస్థాపన చేయలేదు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ ప్రాంతాలను పూర్తిగా మరచిపోయారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తమ ప్రాంతాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కొండవాలు నివాసులు కోరుతున్నారు.


సత్యసాయినగర్‌లో దారుణంగా ప్రధాన రహదారి

రహదారులు నిర్మించాలి

మా ప్రాంతంలో రోడ్ల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. గతంలో సత్యసాయినగర్‌లో అక్కడక్కడా రోడ్లు నిర్మించారు. మా ప్రాంతం వరాహగిరి కాలనీలో కూడా రోడ్లు వేస్తామన్నారు. ఇప్పటివరకు వేయలేదు. దీంతో ఈ దారులపై రాకపోకలు సాగించేందుకు నిత్యం ఇబ్బందులు పడుతున్నాం.

– ఎస్.లక్ష్మి, వరాహగిరి కాలనీ

డ్రైనేజీలు బాగుచేయాలి

వరాహగిరి కాలనీ-1లోని ప్రతి వీధిలోనూ కాలువలు శిథిలమైపోయాయి. వీటిని నిర్మించి దాదాపు పదేళ్లు దాటింది. అప్పటి నుంచి ఇలానే వదిలేశారు. డ్రైనేజీలకు మరమ్మతులు లేవు, కొత్తవి నిర్మించలేదు. దీంతో మా ప్రాంతంలో ఎక్కడికక్కడ కాలువలో నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

– ఎ.ప్రసాద్, వరాహగిరి కాలనీ-1

మా సమస్యలు పట్టించుకోవాలి

గత ప్రభుత్వంలో సత్యసాయినగర్‌లో అక్కడక్కడా రోడ్లు నిర్మించారు. మెయిన్ రోడ్డును బాగుచేయలేదు. ఈ కారణంగా కొన్ని చోట్ల రోడ్లపై రాళ్లు తేలాయి. మరికొన్ని చోట్ల రోడ్లు దెబ్బతిని నీరు నిల్వ ఉండిపోతుంది. పాలకులు, అధికారులు స్పందించి రోడ్లను అభివృద్ధి చేయాలి.

– ఎం.సత్యనారాయణ, సత్యసాయినగర్

క్లుప్తంగా

ఫోర్త్ టౌన్ సీఐగా ఉమాకాంత్ బాధ్యతల స్వీకరణ



తాటిచెట్లపాలెం: ఫోర్త్ టౌన్ లా అండ్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా ఉమాకాంత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి సీఐ ఎ.సత్యనారాయణ బదిలీపై కోర్టు మానిటరింగ్ సెల్ విభాగానికి వెళ్తున్నారు. అక్కడ పనిచేస్తున్న ఉమాకాంత్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సత్యనారాయణ నుంచి ఉమాకాంత్ చార్జ్ తీసుకున్నారు. ఉమాకాంత్ 2004 బ్యాచ్‌కు చెందినవారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసారు.

షిర్డీసాయికి పంచామృతాభిషేకం


ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలోని షిర్డీసాయి ధ్యాన మందిరంలో శనివారం శ్రావణ పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. అర్చకుడు అయిలూరి రామశాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయినాథుడికి పూజలు నిర్వహించారు. పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో బాబాకు పంచామృతాభిషేకం చేశారు. సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

వైభవ వేంకటేశ్వరుడికి విశేష సేవలు


పంచామృతాభిషేక సేవలో పాల్గొన్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో శ్రావణ మాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామికి ఉదయాస్తమాన సేవల అనంతరం 5.30 నుంచి 6.30 గంటల వరకు సుప్రభాత సేవ చేశారు. అర్జిత సేవలో పాల్గొన్న దాతలు, భక్తులు మంగళ ధ్వనితో వేద మంత్రోచ్చారణల మధ్య అభిషేక ప్రదక్షిణ జరిపారు. అనంతరం శ్రీవారికి పాలు, పెరుగు తేనె, నెయ్యి, పంచదార, ఫల రసాలు, పసుపు, కుంకుమ, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా భక్తులు దీపారాధన చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన భవంతిలో 300 మందికి అన్నదానం చేశారు. సాయంత్రం 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెయిన్‌బో కంటి ఆస్పత్రి సహకారంతో ఈ నెల 10న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మాధవి, పి.కమల ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు వుడా కాలనీ ఈస్ట్ పార్కులోని అబ్దుల్ కలాం ఆడిటోరియంలో నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ సుభేష్ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు జరుగుతాయన్నారు. మురళీనగర్, మాధవధార జంట కాలనీల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రోడ్డెక్కిన మురుగు నీరు


సీతంపేట బాపూజీ వీధిలో రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న మురుగు నీరు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట బాపూజీ వీధిలో మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహించింది. మ్యాన్‌హోల్ పొంగడంతో మురుగు, వ్యర్థాలు ఇళ్ల ముందు నుంచి ఏరులై ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. డ్రెయిన్స్‌లో వ్యర్థాలను సక్రమంగా తరలించకపోవడంతో తరచూ మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తోందని స్థానిక మహిళలు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి డ్రెయిన్లలో వ్యర్థాలు తొలగించి సమస్య పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

లలితా పీఠంలో శ్రావణ పౌర్ణమి పూజలు


అమ్మవారి సన్నిధిలో శ్రీచక్ర నవావరణ పూజలు

సీతంపేట: శ్రావణ పౌర్ణమి సందర్భంగా అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో శనివారం విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. అమ్మవారి సన్నిధి, మణిద్వీపంలో శ్రీచక్రనవావరణ నిర్వహించారు. శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని కల్యాణ వేంకటేశ్వరుడికి విశేష అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పీఠం దర్బారు హాల్లో సౌందర్య లహరి పఠించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని, కల్యాణ వేంకటేశ్వరుడిని దర్శించి పూజలు చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


పీఠంలో సౌందర్యలహరి పఠిస్తున్న భక్తులు

వర్ధిల్లు.. నిండు నూరేళ్లు

ఘనంగా రక్షా బంధన్ వేడుకలు


సీతంపేటలో అన్నయ్యకు రాఖీ కడుతున్న చెల్లెమ్మ


బాపూజీనగర్‌లో తమ్ముళ్లకు రాఖీ కట్టిన అక్క

సీతంపేట: సోదర బంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండగ వేడుకలను శనివారం నియోజకవర్గంలో ఘనంగా జరుపుకున్నారు. అక్కచెల్లెమ్మలు అన్నదమ్ములకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి తమ ప్రేమను చాటుకున్నారు. అక్కచెల్లెమ్మలకు చీరలు, కానుకలు ఇచ్చి ఆనందగా సెల్ఫీలతో తీసుకున్నారు. సీతంపేట, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల్లో ప్రతి ఇంటా రక్షా బంధన్ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. అక్కయ్యపాలెంలోని ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీలో దివ్యాంగ బాలలు రాఖీ పండగను ఆనందోత్సహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. సొసైటీ వ్యవస్థాపకురాలు సుచిత్ర బాలకృష్ణ పిల్లల చేత విత్తనాలతో ఎకో ఫ్రెండ్లీ రాఖీలు తయారు చేయించారు. వాటిని పిల్లలకు ఒకరి చేత ఒకరికి కట్టించి స్వీట్లు తినిపించి సంతోషంగా జరుపుకున్నారు. అందరూ కలిసి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా సుచిత్ర మాట్లాడుతూ రాఖీ పండగ ప్రాముఖ్యతను తెలియజెప్పేలా పిల్లలను భాగస్వామ్యం చేస్తూ విత్తనాలతో రాఖీలు తయారు చేయించామన్నారు. రాఖీలను కుండీలో ఉన్న మట్టిలో వేస్తే మొక్కలు వచ్చేలా తయారు చేశామన్నారు.


ప్రజ్వల్ వాణి సొసైటీలో దివ్యాంగ బాలల రక్షా బంధన్ వేడుకలు

ప్రతి ఇంటా రాఖీ శోభ

కంచరపాలెం: శ్రావణ మాస శుద్ధ రాఖీ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి సందర్భంగా కంచరపాలెం, కప్పరాడ, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, జ్ఞానాపురం, సంజీవయ్య కాలనీ, బర్మాక్యాంప్, గొల్లకంచరపాలెం, దుర్గానగర్, గౌరీనగర్, సిద్ధార్థనగర్, ఆశవానిపాలెం, బాపూజీనగర్, శ్యామ్‌నగర్ తదితర ప్రాంతాల్లోనూ రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటా అన్నదమ్ములకు అక్కచెల్లెమ్ములు రాఖీలు కట్టి ఆశీర్వచనాలు, చిరుకానుకలు అందుకున్నారు. కంచరపాలెంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు రక్షా బంధన్ వేడుకలు జరుపుకున్నారు.

కె.కె.రాజుకు రాఖీ కట్టిన సాడి పద్మారెడ్డి



రక్షా బంధన్ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజుకు సీతమ్మధారలోని ఆయన కార్యాలయంలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 24వ వార్డు కార్పొరేటర్, పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి సాడి పద్మారెడ్డి రాఖీ కట్టారు. ఆయన దీవెనలు పొంది పరస్పరం రాఖీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

– తాటిచెట్లపాలెం

‘కృష్ణ స్మరణ’ పుస్తకావిష్కరణ

ఏయూక్యాంపస్: శ్రీ శారద అన్నమయ్య సంగీత విద్యాలయ రజతోత్సవం బీచ్ రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సంగీత విద్వాంసుడు పారుపల్లి సత్యనారాయణ స్థాపించిన శ్రీ శారద అన్నమయ్య సంగీత విద్యాలయం 25వ వార్షికోత్సవంలో భాగంగా పారుపల్లి శ్రీరామ చంద్రమూర్తి రచించిన కృష్ణ స్మరణ పుస్తకాన్ని మిహిర సంపాదకులు ఎం.ప్రద్యుమ్న ఆవిష్కరించారు. రెండున్నర దశాబ్దాలుగా సంగీత సేవ చేస్తూ ఎందరినో సంగీతంలో నిష్ణాతులుగా తీర్చిదిద్దిన సంస్థ కృషిని ఎం.వి.రాజశేఖర్ కొనియాడారు. కృష్ణ స్మరణ పుస్తక విశేషాలను ప్రద్యుమ్న తెలియజేశారు. సంగీత కళాకారులు చైతన్య సోదరులు బి.కృష్ణమాచార్యులు, వారణాసి వెంకటేశ్వరశర్మ, చాగంటి సోమ సుందర్లను ఈ సందర్భంగా సత్కరించారు. అనంతరం పారుపల్లి సత్యనారాయణ శిష్యబృందం అన్నమాచార్య సంకీర్తనలు, త్యాగరాజ స్వామి సంకీర్తలను ఆలపించారు. సంగీత గురువు పారుపల్లి సత్యనారాయణ దంపతులకు పాదపూజ చేసి గురు సత్కారం జరిపారు.

దేశభక్తిని చాటేలా ‘హర్ ఘర్ తిరంగా’


రైల్వే స్టేడియం వద్ద త్రివర్ణ పతాకాలతో దేశభక్తి నినాదాలు చేస్తున్న క్రీడాకారులు

తాటిచెట్లపాలెం: దేశవ్యాప్తంగా దేశభక్తిని పెంపొందించే దిశగా చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో వాల్తేర్ డివిజన్ ఉత్సాహంగా పాల్గొంటోంది. డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా నేతృత్వంలో 76వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా డివిజన్ పరిధిలో పలు వరుస కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ వాల్తేర్ డివిజన్ స్పోర్ట్ ఆఫీసర్ ఎం.హరనాథ్ ఆధ్వర్యంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. రైల్వే స్పోర్ట్ స్టేడియం వద్ద ర్యాలీని స్పోర్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్.ఉష జెండా ఊపి ప్రారంభించారు. రైల్వే భద్రతా దళం, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ అజయ్ ప్రకాష్ దూబే నేతృత్వంలో హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీని పలు రైల్వే కాలనీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్ క్లబ్‌లో రైల్వే ఉద్యోగుల కుటుంబ సభ్యులు, చిన్నారుల కోసం దేశభక్తి చలనచిత్రాలను ప్రదర్శించారు.


హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీలో వాల్తేర్ డివిజన్ ఆర్పీఎఫ్ సిబ్బంది